# 6

## కవిగారూ కుర్రాళ్లూ

ఆరోజు....

కవిగారు కందిపచ్చడీ, చారునీళ్ళతో సుష్టుగా భోంచేసి లేచి, ఒక్కగానొక్క పడకకుర్చీ నాక్రమించుకుని; డబ్బా బోర్లించగా దొరికిన వక్కపలుకులు నోట్లో దాచుకుని, మత్తుగా కళ్ళు మూసుకుని హాయిగా వూహా జగత్తుకి సాగిపోయారు.

ఆయన గొప్పకవులు, గొప్ప రచయితలు, గొప్ప విమర్శకులు, గొప్ప సంఘసంస్కర్తలు, గొప్ప మానవసేవాభిలాషులు, గొప్ప .. ఈ పొగడ్తలన్నిటా ఆయన చిరునవ్వులతో ఏకీభవిస్తారు. కలంపట్టి కావ్య జగత్తులో కురకాలనే కోరిక ఆయనకు హఠాత్తుగా ముప్పై నాలుగో ఏట పుట్టుకొచ్చింది. అచంచలమైన ఆత్మ విశ్వాసంతో వెనువెంటనే కార్యసాధన కుపక్రమించారు. పద్యాలతో ప్రారంభించి, గేయాలలోకి దించి, నవలలు రాసి, నాటకాలు సృష్టించి, కథలు అల్లి, బాలశీర్షికలు నిర్వహించి, అపారంగా, అవిరామంగా శ్రమించి, సాహితీ ప్రక్రియలన్నిటా చేయితిరిగిన దిట్ట అనిపించుకున్నారు.

ఆయన రచనలనిండా ప్రేమ, విరహం, శృంగారం,లేదా - అభ్యుదయం, ఆదర్శం, సంస్కారం, లేదా-దేశభక్తి, త్యాగనిరతీ, జాతీయతా-లేదా ... ఇవన్నీ కలిసీ వుంటాయి. ఆయన వూటకలం నవరసాలూ పోసుకుని పూటకో రకంగా చిందులేస్తూ వుంటుంది.

ఆయనకు కూడా అమితాశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే, కలం పట్టిన ఐదారు సంవత్సరాలలోనే పన్నెండు వేల తావుల సాహిత్యం సృష్టించ గలగటం ఎంత వింత! ఈ వింతలో ఎక్కువ భాగం-చాలా గొప్ప అద్భుత ఘట్టాలతో నిండి వున్న సాహిత్యం- వారిబట్టల పెట్టెలోనే వుంది. ఉన్న నాలుగు గుడ్డలూ ఏ తలుపు సందునో అట్టే పెట్టుకోవచ్చునని, ఆ పాత కావిడిపెట్టి కేవలం సాహిత్యానికే కేటాయించా రాయన. ఆ పెట్టెడు రచనలూ రుచి చూసి, కడుపునిండా ఆనందించే భాగ్యం కవిగారి అర్ధాంగి పిచ్చమ్మగారికి మాత్రమే దక్కుతుంది. ఇలాంటి సందర్భాలలో నైనా పూర్వజన్మల మీదా, ఖర్మ ఫలాలమీదా నమ్మకం కుదరాలి మూర్ఖపు ప్రజలకి.

వచ్చిన చిక్కేమిటంటే, కవిగారు కొత్త నవలో, నాటకమో, పూర్తి చెయ్యబోతోంటే పిచ్చమ్మగారు హఠాత్తుగా పుట్టింటి ప్రయాణం పెట్టేసు కుంటుంది. ఆవిణ్ణి వారించటం ఎవరితరం? కవి అవనీ! వాడి అబ్బ అవనీ!

వారం రోజుల్లో వస్తానని వెళ్ళినావిడ, వారానికి వారం జత చేసి గడువులు పొడిగిస్తూ వుంటుంది. కవిగారు కొత్త నవల పట్టుకుని అత్తవారింటికీ బయల్దేరి వస్తున్నారని తెలిసిన పూట మాత్రం ఆవిడ వచ్చినంత హడావిడిగానూ వెళ్ళిపోతుంది. ఆ బాటసారు లిద్దరూ ఏ బెజవాడ స్టేషన్ లోనో ఎదురు బొదురు బళ్ళలో కలుసుకుని వెనక్కో ముందుకో పోవటం కద్దు. ఇంటి కొచ్చిన తర్వాత ఆవిడకో బ్రహ్మాండమైన సౌకర్యం జరుగు తుంది. వారం రోజులవరకూ, పాడుపంట (ఇది ఆవిడమాటే) చెయ్యక్కర్లేదు. ఇక్కడి పుల్ల తీసి అక్కడ పెట్టక్కర్లేదు. కాలు కదపక్కర్లేదు. పడక్కుర్చీకూడా ఆవిడదే, చెయ్యాల్సిందల్లా కవిగారు కొత్త రచన చదువు తోంటే వూఁ కొట్టటం. అదే ఆవిడ కెందుకో గిట్టదు. పిచ్చమ్మగారికి పతి భక్తి లేదేమో నని ఎవరైనా శంకిస్తే, బొందితో నరకానికి పోతారు. పాతివ్రత్యమంటే ఆవిడకు మహా యిది. ఆ యిదితోనే ఆవిడ యిష్టానిష్టాల్ని త్యాగంచేసి, కవిగారు రాసినవన్నీ ఎప్పుడో అప్పుడు విని ఆనందించటానికి

శక్తికొద్దీ ప్రయత్నిస్తుంది. కోర్టుల్లో విడాకుల చట్టమంటూ ఒకటి వెలిసిందని చెప్తే, ఆవిడ మరో పది జన్మ లెత్తినా నమ్మదు.

కథకొద్దాం:

పిచ్చమ్మగారు వంటిల్లు సర్దుకొని వరండాలో కొచ్చింది. దండెం మీద వేళ్ళాడుతోన్న పాత గుడ్డలేవో లాగి ముందేసుకూర్చుంది. "ఈసారి జీతాలు రాగానే నాకో కట్టుడు చీర కొనాలి సుమండీ! వొంటి మీద గుడ్డలన్నీ చిరుగు పట్టేశాయి" అంది దేవుణ్ణుద్దేశించి.

కవిగారు మాట్లాడలేదు. అసలు విన్నట్టులేదు. ఆయన కేదో అద్భుతమైన ప్రేరణ దొరికింది. కవిగారి కన్నుల ముందు ఒకానొక స్వప్న సుందరి సిగ్గు దొంతరల మధ్య సాక్షాత్కరించింది. పద్య పాదాల కోసం తల కిందికీ మీదికీ ఝాడించటం మొదలుపెట్టారు. చివరికి మాటలు కలిపి, ప్రాసలు జోడించి జలతారంచు పట్టు పీతాంబరాలతో స్వప్న సుందరి మేనంతా సింగారించారు. గాలితో సయ్యాటలాడే ధవళవర్ణపు సిల్కు వల్లెవాటువేసి కొంత తృప్తి పడ్డారు.

పిచ్చమ్మగారు వెర్రెత్తిన దానిలా కుట్టే కుట్టే పాతగుడ్డలక్కడ పారేసి లోపలికి పోయి, పళ్ళూడిన కొమ్ముదువ్వెన వెతికి తెచ్చుకుని జుట్టు ముడి వూడదీసి జంతు వేటనుపక్రమించింది.

"పిల్ల వెధవలు బళ్ళల్లోకి పోతారు. బుర్రలనిండా ఎక్కించుకొస్తారు. నా దగ్గిర పడుకోకండర్రా అంటే ఛస్తే వినరు! కంపరం పుడుతోంది, పాడు పేలు. ఓ మంచి దువ్వెన తెమ్మని ఎన్నాళ్ళనుంచీ చెప్తున్నానండీ మీకూ?" అంటూనే ఆవిడ బరబరా చెంపలు దువ్వి మహోత్సాహంతో జీవహింస సాగించింది.

కవిగారు ఈసారి సీసపద్యం ప్రారంభించారు.

స్వప్నసుందరిని చేరబిలిచి, గండు తుమ్మెదల దండువంటి ఆమె జుత్తు నొక్కులు, సవరించి, ఘుమఘుమలాడే సంపెంగనూనెరాసి, మీగడ

తరకవంటి దంతపు దువ్వెనతో దువ్వి, చంద్రవంక శిఖచుట్టి, నిండుగా సన్నజాజుల చెండు తురిమి, మేలిముసుగు సర్ది - మహదానందం పొందారు.

"ఎంత జుట్టు! ఎంత జుట్టు! ముక్కాలిపీటమీద కూచుంటేగానీ దువ్వుకోడం కుదిరేదికాదు. బెత్తెడు వెడల్పున బారెడు.... బారెడేం? అంత జడ వచ్చేది మీరెరగనిదా ఏమిటి? పెద్దవాడి పుట్టకతో ప్రారంభ మైంది. వూక రాలినట్టు రాలడం. మంత్రం పెట్టినట్టు మాయమైపోయింది. ఏమిటో వెర్రి! ఇవ్వాళింట్లో, రేపు మంట్లో జుట్టు దేముచ్చె!" హఠాత్తుగా ఆవిడ కా క్షణంలో పుట్టెడు వైరాగ్యం ముంచుకొచ్చింది. "అంద చందాలు యింతేనా?" అని దిగులుపుట్టింది. దీనంగా దేవుణ్ణి చూసింది.

ఆయన తమ స్వప్న సుందరి పాదపద్మాలకు చిరుగజ్జెలు కట్టి నెమలిలా ఆడిస్తూ, కోయిలలా పాడిస్తూ, తన్మయు లౌతున్నారు.

వారి కవితారాధన పరిసరాల్లో పిచ్చమ్మగారి దీనాలాపం అరణ్య రోదనం అయింది.

"పిచ్చిదానా! ఎందుకా దిగులు? నువ్వెప్పుడూ నాకు రంభలాగే కనిపిస్తావు." అనకపోయినా——ఏదో ఓదార్పుగా ఒక చల్లటి మాట అనక పోతారా అని పిచ్చెమ్మగా రాశపడింది.-"వచ్చే కాలవా(? పోయే కాలవా(? పదిమందితోపాటే పిచ్చెమ్మానూ" అంటూ స్వగతం చెప్పుకుని తృప్తిపడి జుట్టు ముడేసుకుంటూ లేవబోయిందావిడ.

హఠాత్తుగా కవిగారు సాదా లోకంలో కొచ్చేశారు.

"కూచో! కూచో! లేవకు. లేవకు. కందాలు నాలుగు, సీసం ఒకటి రాశాను." అంటూ కాయితాలు ఎత్తిపట్టి, కంఠం సవరించుకుని కవితా గానాని కుపక్రమిం చేంతలో....

ఎవరో యిద్దరు పెద్ద కుర్రాళ్ళు - పొడుగు లాగూలవాళ్ళూ, పొట్టి చొక్కాలవాళ్ళూ, అందమైన మొఖాలవాళ్ళు, వినయమైన చూపుల వాళ్ళు, పదునారేళ్ళ వయస్సువాళ్లు, రామలక్ష్మణుల ఛాయలవాళ్లు, అలాంటి

వాళ్ళు ముకుళిత హస్తాలతో మెట్లమీద సాక్షాత్కరించారు. పిచ్చమ్మగారు పిచ్చుకిలా గంతులేసి, లోపలికెళ్ళి పడింది. సందేహాలన్నీ హరించి దేవుడు ఖచ్చితంగా వున్నాడనే నమ్మకం గాఢంగా కలిగిందావిడికా ఘడియలో.

కుర్రాళ్ళు వచ్చింది కవిగారి దర్శనార్థం.

అలాంటివే కవిగారు క్షణ క్షణానికీ నెమరు వేసుకుంటూ జన్మ జన్మలకూ జప్తి వుంచుకోకలిగే మధుర ఘట్టాలు. కుర్రాళ్ళు కవిగార్ని భక్తి భావంతో నిలువెల్లా పరికించారు. ఈయన, ఈయనేనా? నవలలు.... నాటకాలు....పద్యాలు గేయాలు.... కథలు.... కావ్యాలు.... ఈయనేనా కవిగారి బక్క చిక్కిన శరీరంగానీ, చిరుగు పట్టిన బనీనుగానీ, దండెం మీద వేళ్ళాడుతోన్న పాత పీలికలుగాని, ఇంటికప్పులో మెరుస్తోన్న కన్నాలుగానీ, కూర్చోటానికి లేని కుర్చీలుగానీ- ఏవీ వాళ్ళ ఆలోచనకి అందలేదు.

కవిగారు....కవిగారు కవిగారు నించున్న ఆ గది వెన్నెల మడుగులా వుంది. కవిగారి పక్కన పడక్కుర్చీ రాయంచలా వుంది కవిగారు సాక్షాత్తూ దేవుళ్ళా వున్నారు. కుర్రాళ్ళిద్దరూ సంతోషంతో తన్మయత్వం పొందారు.

"మీరంటే... మాకు....ఎంతో భక్తి."

"భక్తి అంటే చాలదు. ఎంతో ఆరాధన."

"మీరు పత్రికల్లో రాసినవన్నీ చదివాం."

"మేమిద్దరం వాటిని గురించి తర్కించుకుంటాం."

"మిమ్మల్ని చూడాలని, చాలా రోజులనుంచీ అనుకుంటున్నాం."

"అదృష్ట వశాత్తూ యివ్వాల్టి కయింది."

కుర్రాళ్ళిద్దరూ ఆగేరు. కవిగారు మైమరపుతో తల పంకిస్తూన్నారు.

"మీరీమధ్య కొత్తవేం రాశారు?"

"రాయకేం!.... కూర్చోండి. కూర్చోండి ముందు కూర్చోండి నాయనా! ఇదిగో! ఇప్పుడే చదివి వినిపిస్తాను."

పాతకాయితాలేవో వెనక్కి గెంటి గోడదగ్గిర బల్లమీద కుర్రాళ్ళు కూర్చునేటంతా ఖాళీ చేశారాయన.

కుర్రాళ్ళకి యింద్రజాలంలా వుంది.

అసలు కవిగారు కన్పించరేమో అనుకున్నారు. కన్పించినా మాట్లాడరేమో అనుకున్నారు. మాట్లాడినా, ఏమో! ఏమంటారో అనుకున్నారు. అలాంటి కవిగారు వారే స్వయంగా కనిపించి; స్వయంగా మాట్లాడి, వారు రాసిందికూడా స్వంత కంఠంతో చదివి వినిపిస్తానంటే, నమ్మలేనంత అబద్ధంలా వుంది.

కవిగారు రాగయుక్తంగా చదువుతూ, మధ్య మధ్య శ్లేషల చమత్కారం విప్పి చెప్పటంతో ఆ నాలుగు పద్యాలూ అరగంటకు ముగిశాయి.

కుర్రాళ్ళు పసివాళ్ళలాగ విన్నారు. ఆనందించారు.

"కవిగారీ పద్యాలు రాయటానికి ఇన్‌స్పిరేషన్ ఎవరంటావ్?"

"ఇంకెవరు? వారి భార్యే...."

"ఆవిణ్ణికూడా చూస్తే?"

"నిజమే. చూస్తే...." గుసగుసలు.

"ఏవిటి నాయనా? మీ సందేహమేమిటి?" తీర్చాలని కవిగారి కుతూహలం.

కుర్రాళ్ళిద్దరూ చూపులు కలుపుకున్నారు. ధైర్యం తెచ్చుకున్నారు— "మాకోసారి అక్కయ్యగార్నికూడా చూడాలని వుందండీ!"

పిచ్చమ్మగారుకూడా విందీ మాటలు. ఆవిడ తలుపు వెనక నుంచి కుర్రాళ్ళని చూస్తోనే వుంది. 'ఆ ఎర్రటి కుర్రాడే కులమో? పెద్ద పిల్ల పెళ్ళికెదుగుతోంది. దానా దీనా ఆ ముక్క ఎత్తినా బాగుణ్ణీయన. ఏవీ పట్టించుకోరు. మాలోకం మనిషి—పిలిచి చెప్పుదునా?....' సంశయిస్తోందావిడ.

"అక్కయ్యగార్ని చూపించరా?" అభ్యర్థన.

"అదెంత భాగ్యం నాయనా! పిలుస్తా నుండండి"—తలతిప్పి లోపలి గుమ్మంవేపు మొహంపెట్టి—"ఏమేఁ" అని గావుకేక పెట్టారాయన.

బిక్కచచ్చి పోయారు కుర్రాళ్ళిద్దరూ.

అంతలో పిచ్చమ్మగారు దోబూచులాడే దానిలా గుమ్మంలోకి తొంగి చూసింది.

వెర్రిమొహా లేసి తెల్లబోయారు కుర్రాళ్ళిద్దరూ, వెలిసిపోయిన పాత చీర - మట్టి గాజులు - మెళ్ళో తాడుముక్క - నిమ్మకాయంత ముడి-పీక్కు-పోయిన మొహం ఈవిడా? ఈవిడేనా కవిగారి భార్య? ఏవీ ఆ జలతారంచు పట్టు పీతాంబరాలు? ఏవీ ఆ గండు తుమ్మెదల దండు కేశపాశాలు? ఆ తళుకు బెంపలు, ఆ అందాల చిందులు, ఆ కలకలలు, ఆ మిలమిలలు....? కాదు, ఈవిడా కవితా సుందరికి ఇన్‌స్పిరేషన్ ఎలా అవుతుంది? మరి ఆ పద్యాలంత బాగున్నాయేం? కుర్రాళ్లు వాళ్ళ లోకంలో వాళ్లున్నారని సందు చూసి పిచ్చమ్మగారు మొగుడికి సైగ చేసి కొంచెం కంఠం తగ్గించి కడుపులో మాటకాస్తా అనేసింది. "ఆ ఎర్రటి కుర్రాడే కులమో కనుక్కోండి. ఎందుకేనా మంచిది. మర్చిపోకండి." ఆ రెండు ముక్కలూ చెప్పేసి గడప దాటి అదృశ్యమై పోయింది.

కుర్రాళ్ళిద్దరూ కూడబలుక్కున్నట్లు ఎవరికి వాళ్ళే కర్రల్లా లేచి నించు న్నారు— "వెళ్తామండీ."

"అదేవిటి? అప్పుడే! మంచిమాటే! కూచోండోయ్! నా రచనలన్నీ చదివి వినిపిస్తాను. లోపల చాలా మంచి మంచివి వున్నాయిలెండి. ఒసే! ఆ పెట్టిలా పడేయ్" కంగారుగా మరో కేక పెట్టారాయన.

అప్పటికే కుర్రాళ్ళు వీధి గుమ్మంలో వున్నారు.

"వెళ్ళిపోవాలండీ! చాలా అర్జంటు" మెట్లు దూకేశారు.

"పోనీ మళ్ళా రేపురండి" కవిగారి ఆహ్వానం దీనంగా.

కుర్రాళ్ళెలా మాయమయ్యారో కంటికనిపించలేదు. కవిగారికి పీడొదిలిచ్చేద్దాం.

కుర్రాళ్ళిద్దరూ ఆశ్చర్యం వెలిబుచ్చుకోటానికి రోడ్డు మధ్య ఆగి పోయారు.

"కవిగారుకూడా భార్య నలా పిల్చారేవిటి?"

"అస లావిడలా వుం దేమిటి? కవితా సుందరికీ, ఆవిడకీ పోలికలే లేవు."

"సుందరి మీద అంత అందంగా పద్యాలు రాశారు కదా? భార్య కూడా అలా వుంటే బావుంటుందని కవిగారికి తెలీటం లేదూ?"

"అందాలన్నీ కాయితాల మీదుంటే ఏం వస్తుందీ?"

"నా కేవిటో గాభరాగా వుందిరా! ఏదైనా సినిమాకి పోదాం."

"నా కెందుకో కడుపులో తిప్పుతోంది, విఠలాచార్య పిక్చర్ కే పోదాం."

సోడాలు తాగి, తీరిగ్గా సినిమాహాల్లో కూచున్నాక, కుర్రాళ్ళ మొహాల మీదకి కొంచెం కళ వచ్చింది.

ఉన్నట్టుండి యిద్దరూ హఠాత్తుగా ఒకరితో ఒకరనుకున్నారు— "హోరినీ! కవిగారూ ఆయన పెళ్ళామూ(....! మామ్మూలు వాళ్ళేరా! అందర్లాంటి వాళ్ళేరా!"

"కవి గార్ని తల్చుకుంటోంటే యిప్పుడు నాకేవీ భక్తిగా లేదు— నీకో?"

"నాకూనూ. ఆయన కూడా 'వోసే' అన్నారేవిటి?"

( "ప్రగతి" వారపత్రిక నుంచి )